


www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా


## పాఠశాలలో ఉండాల్సిన విద్యార్థులు
# కోచింగ్ సెంటర్ ఉండడం చట్టరీత్యా నేరం

జిల్లా కలెక్టర్ ఫిర్యాదు: పిడిఎస్ యు



**ఎమ్మిగనూరు,జూలై06.అక్షర టైమ్స్:-** ఎమ్మిగనూరు పట్టణంలో అనుమతులు లేకుండా నడుపుతున్న ప్రైవేట్ నవోదయ కోచింగ్ సెంటర్లను మూసి వేయించండి,విద్యార్థి ఆత్మహత్యకు కారణం అయిన కోచింగ్ నిర్వాహకులు పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ సిరికి పి డిఎస్ యు రాష్ట్ర కార్యదర్శి పి ఎస్ యు జిల్లా కార్యదర్శి సురేష్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవోదయ కోచింగ్ సెంటర్లు పుట్టగొడుగుల పుట్టకొస్తున్నాయి. విద్యార్థులు బడిలో ఉండాల్సిన వారు కోచింగ్ సెంటర్లలో ఉంటున్నారు విద్యార్థులు పాఠశాలలో హాజరు కాకుండా ఈ కోచింగ్ సెంటర్లలో ఫుల్ టైంలో కోచింగ్ లో ఉంటున్నారు కోచింగ్ సెంటర్ యాజమాన్యాలు ప్రైవేటు , ప్రభుత్వ పాఠశాల వారితో మాట్లాడుకుని అటెండెన్స్ వేయిస్తూ కొంత మొత్తంలో వారికి ఇస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వం నుండి తల్లికి వదనం తీసుకుంటూ పాఠశాలకు వెళ్లకుండా కోచింగ్ సెంటర్లో ఉంచుతున్నారు నిన్న ఎమ్మిగనూరు పట్టణంలో గురు కోచింగ్ సెంటర్లో నిశాంత్ అనే విద్యార్థి కోచింగ్ లో ఉండటానికి ఇష్టం లేక విద్యార్థి హాస్టల్ బిల్డింగ్ నుండి దూకి ఆత్మహత్య కు పాల్పడడం జరిగింది. ఇప్పుడు విద్యార్థి చావు బ్రతుకుల మధ్యలో ఉన్నాడు ఈ సంఘటనకు ఎవరు బాధ్యత వహిస్తారు అలాగే ఇక్కడ ఉన్న కోచింగ్ సెంటర్లకు, హాస్టల్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు లేకుండా నడుపుతున్నారు అలాగే పోలీస్ శాఖ నుండి, మరియు మున్సిపల్ శాఖ నుండి మరియు ఫుడ్ కమిషన్ నుండి ఏ అనుమతులు తీసుకోకుండా నడుతున్నారు ఈ విషయం పై అనేక సార్లు జిల్లా విద్యాధికారి డిఇవో కు ఫిర్యాదు చేసిన తూతూ మంత్రంగా విచారణ చేస్తారు మళ్ళీ యధావిధిగా కొనగిస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలో ఉండాల్సిన వారు ఇలా కోచింగ్ లు పేరుతో చేర్చుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని ఆయా నవోదయ కోచింగ్ సెంటర్లు పై చర్యలు తీసుకోలేని పక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని వారు తెలిపారు.

## యూరియా అమ్మకాలపై ఆకస్మిక తనిఖీ





**గోస్పాడు,జులై06.అక్షర టైమ్స్:-** గోస్పాడు లోని శ్రీ వెంకట సాయి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ ఎరువుల దుకాణంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి స్వప్నిక రెడ్డి మరియు స్పెషల్ స్క్వాడ్ బృందం సభ్యులు జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ చెన్నయ్య, ఆళ్లగడ్డ ఏడిఏ విజయ్ శేఖర్ ,మరియు నంద్యాల టెక్నికల్ ఏవో శశిధర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించడం జరిగింది. గత ఏప్రిల్, మే మరియు జూన్ నెలలో అధిక యూరియా అమ్మకాలు జరిపిన ఎరువుల దుకాణాలపై ప్రత్యేక బృందాలు తనిఖీ నిర్వహించి అమ్మకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించడం జరిగింది. అధిక ధరలకు అమ్మ రాదని హెచ్చరించారు. రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని తెలియజేశారు. జిల్లాలో యూరియా స్టాకు సమృద్ధిగా అందుబాటులో ఉందని శాస్త్రవేత్తల సిఫార్సు మేరకు ఎరువుల వాడకం కొరకు ప్రభుత్వం ఏపీఎయిమ్స్ ఆప్ ద్వారా రైతులకు యూరియా మరియు డిఏపి ఎరువుల పంపిణీ చేయడం జరుగుతుందని కనుక రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

## షూటింగ్ బాల్ పోటీల్లో
## 'శ్రీ శాంతినికేతన్' విద్యార్థుల జైత్రయాత్ర

రాష్ట్ర స్థాయికి నలుగురు ఎంపిక



**నంద్యాల,జులై06.అక్షర టైమ్స్:-** నంద్యాల క్రాంతి నగర్‌లోని శ్రీ శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు క్రీడారంగంలో అద్భుత ఘనత సాధించారు. జూలై 4న నంద్యాల ఎస్పీజీ మైదానంలో నిర్వహించిన షూటింగ్ బాల్ ఎంపిక పోటీలలో అసాధారణ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 10వ తరగతికి చెందిన సుధీర్ కుమార్ రెడ్డి, ఎం. సంతోష్, మరియు 9వ తరగతికి చెందిన ఎం. శివనాయక్, ఎం. చరణ్ నాయక్ ఈ ఘనత సాధించిన వారిలో ఉన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన పాఠశాల కీర్తిని చాటిన ఈ విద్యార్థులను పాఠశాల చైర్మన్ సుధాకర్ సార్ ప్రత్యేకంగా అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ఇలాంటి ప్రతిభ చాటడం గర్వకారణమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా విజేతలైన నలుగురు క్రీడాకారులకు చైర్మన్ సుధాకర్ చేతుల మీదుగా ఘనంగా మెమెంటోలు అందజేసి ప్రశంసించారు. రాబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా వీరు ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## ఈనెల 9న మండల సర్వసభ్య
## సమావేశం: ఎంపిడిఓ కుళాయమ్మ

**వేంపల్లె,జూలై06.అక్షర టైమ్స్:-** ఓఈనెల 9న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ కుళాయమ్మ వెల్లడించారు. వైద్య ఆరోగ్యం, తాగునీరు, పారిశుధ్యం, పౌరసరఫరా, వ్యవసాయం, విద్యా, విద్యుత్, ఉపాధి, గృహ నిర్మాణం, వెలుగు, ఉద్యానవన, రోడ్లు భవనాలు సంబంధిత అధికారులు తమ పూర్తి నివేదికతో సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. గురువారం ఉదయం 10:30 కు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు.

## రాజధాని విషయంలో వైకాపా,టీడీపీ దొందూ దొందే

సెల్ఫ్ గోల్, సెల్ఫ్ డబ్బా అని తులసి రెడ్డి ధ్వజం



**వేంపల్లె,జూలై06.అక్షర టైమ్స్:-** ఆంధ్రప్రదేశ్ రాజధాని విషయంలో అటు వైకాపా, ఇటు టీడీపీ దొందూ దొందే పరిస్థితి కొనసాగుతోందని, వైకాపాది సెల్ఫ్ గోల్ కాగా టీడీపీది సెల్ఫ్ డబ్బా అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విమర్శించారు. సోమవారం వేంపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర రాజధాని విషయంలో వైకాపా పార్టీకి స్థిరమైన విధానం లేదని ఆరోపించారు. మార్జాల న్యాయం పాటిస్తున్నట్లుగా రాజధాని అంశాన్ని పదేపదే మార్చుకుంటూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందని ఎద్దేవా చేశారు. 2019 ఎన్నికల సమయంలో అమరావతినే రాజధానిగా ప్రకటించిన వైకాపా, అనంతరం విశాఖకు మార్చేందుకు ప్రయత్నించి విఫలమైందని తెలిపారు. 2024 తర్వాత మళ్లీ కొత్త ప్రతిపాదనలతో ముందుకు రావడం అస్థిరతకు నిదర్శనమని అన్నారు. అదే సమయంలో టీడీపీ నవ నగరాలు, అంతర్జాతీయ నగరం" వంటి భారీ ప్రకటనలకే పరిమితమైందని, విభజన చట్టం ప్రకారం కేంద్ర నిధులను సమర్థవంతంగా వినియోగించి రాజధాని అభివృద్ధి చేయడంలో విఫలమైందని విమర్శించారు. వెలగపూడిలో ఇప్పటికే తాత్కాలిక సచివాలయానికి రూ.1151 కోట్లు ఖర్చు కాగా, అదే ప్రాంతంలో మళ్లీ రూ.4689 కోట్లతో శాశ్వత సచివాలయం నిర్మించడం దుబారా అని ప్రశ్నించారు. ఒకే రాష్ట్రం -- ఒకే రాజధాని -- అదీ అమరావతి అన్నది కాంగ్రెస్ విధానమని ఆయన స్పష్టం చేశారు. అమరావతి ప్రజా రాజధానిగా ఉండాలని, కేంద్ర గ్రాంట్లతోనే అభివృద్ధి జరగాలని సూచించారు. రైతుల సమస్యలు తక్షణమే పరిష్కరించడంతో పాటు అభివృద్ధి, అధికార వికేంద్రీకరణపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని తులసి రెడ్డి కోరారు.

## జనసేన పార్టీ పదవికి
## దరఖాస్తు సమర్పించిన యారవ దివ్య

పార్టీ అప్పగించే బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని వెల్లడి



**కడప,జూలై06.అక్షర టైమ్స్:-** జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పార్టీ పదవుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఆదివారం కడప నగరంలోని హరిత హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ పార్లమెంట్ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ సభ్యురాలు యారవ దివ్య పార్టీ పదవి కోసం తన దరఖాస్తును జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ పార్లమెంట్ పర్యవేక్షకులు చిలకం మధుసూదన్ రెడ్డికి సమర్పించారు. ఈ సందర్భంగా యారవ దివ్య మాట్లాడుతూ, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ అప్పగించే ఏ బాధ్యతనైనా సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మరింత చేరువయ్యేలా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్, జనసేన పార్టీ పార్లమెంట్ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ సభ్యురాలు తాతంశెట్టి తులసి, జిల్లా ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ పత్తి విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిలువెత్తు
## నిదర్శనం శ్యామా ప్రసాద్ ముఖర్జీ

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్



**వేంపల్లె,జూలై06.అక్షర టైమ్స్:-** ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా స్థానిక పట్టణంలో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ, ఆర్టికల్ 370కు వ్యతిరేకంగా తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి దేశ సమైక్యత కోసం పోరాడిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. ఏక్ దేశ్ మే దో నిషాన్, దో విధాన్, దో ప్రధాన్ నహీ చలేగా అనే నినాదంతో అఖండ భారతం కోసం ఉద్యమించారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆర్టికల్ 370 రద్దుతో ముఖర్జీ ఆశయాలు సాకారమయ్యాయని పేర్కొన్నారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, ఎస్సీ మోర్చా నాయకులు ముద్ది శివకృష్ణ, జగదీష్, సాయినాథ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## 15 వ తేదీన జరిగే
## మహా ధర్నాను జయప్రదం చేయండి

విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటి



**బద్వేల్,జులై06.అక్షర టైమ్స్:-** విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 15 వ తేదీన జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని సోమవారం స్థానిక అట్లూర్ సెక్షన్ ఆఫీసు నందు స్ట్రగుల్ కమిటీ సమావేశం నిర్వహించారి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా బి .నాయబ్ రసూల్ హాజరై మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యుత్ యాజమాన్యం ప్రభుత్వం, విద్యుత్ ఉద్యోగుల దీర్ఘ కాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఇందుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. అందులో భాగంగా, ఈనెల 15 వ తేదీన ఎస్.పి.డి.సి.ఎల్ ఆఫీసు తిరుపతి వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మైదుకూరు డివిజన్ ట్రెజరర్ ప్రసాద్ మాట్లాడుతూ, వేతన సవరణ కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని, పెండింగ్ లో ఉన్న 4 కరువు భత్యం బకాయిలు చెల్లించాలని, కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగులర్ చేయాలనీ, ఆయన డిమాండ్ చేశారు. డిస్కం ఉపాధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ, డిస్కం పరిధిలోని పెండింగ్ లో వున్న ఉద్యోగుల కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. స్ట్రగుల్ కమిటీ డివిజన్ నాయకులు చిన్ని కృష్ణ, పవన్ మాట్లాడుతు టాటా ఏ ఐ జి పాలసీ చాలా అధ్వానంగా ఉందని ఈ పాలసీ మీద యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.అలాగే పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. మైదుకూరు డివిజన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పిసి కొండయ్య మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు తెలంగాణ తరహాలో 48 వేల రూపాయలు జీతం చెల్లించాలని ఆయన తెలిపారు. అపరిమిత మెడికల్ సౌకర్యం కల్పించాలని కోరారు. షరతులు లేకుండా కాంట్రాక్ట్ కార్మికులకు రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశం లో అట్లూరు సెక్షన్ సిబ్బంది దినేష్ రెడ్డి, రాజ్ కుమార్ రాజయ్య ,శివప్రసాద్, ఎల్లయ్య, సురేష్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ప్రజావేదికకు 127 ఫిర్యాదులు

అడిషనల్ ఎస్పీ ఖాదర్ భాషా



**నంద్యాల,జులై06.అక్షర టైమ్స్:-** నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో 127 ఫిర్యాదులు అందాయి. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్. ఖాదర్ భాషా ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను విన్న ఆయన, ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోనే పరిష్కారం చూపాలని సూచించారు.

## రోడ్లు భద్రతపై ఎస్సై విద్య శ్రీ అవగాహన

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం..

అప్రమత్తంగా ఉండాలని ఎస్సై విద్యశ్రీ పిలుపు



**ఆదోని,జూలై06.అక్షర టైమ్స్:-** ఆదోని మండలం పాండవగల గ్రామం సమీపంలో తరుచు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు పెద్ద తుంబళం ఎస్సై విద్య శ్రీ సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై విద్య శ్రీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. దివ్య చక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించడం తమ భద్రతకే కాక కుటుంబ సభ్యుల భవిష్యత్తు కూడా ఎంతో అవసరమని తెలిపారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదని, చిన్న వయసులో వాహనాలు నడపడం ప్రమాదాలకు దారితీస్తుందని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాంతక ప్రమాదాల సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. మైనర్లకు మైనర్లకు వాహనాలు ఇచ్చినట్లు గుర్తిస్తే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి రోడ్డు భద్రత నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఎస్సై విద్య శ్రీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దానధర్మా చారిటబుల్ ట్రస్ట్
## ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం





**సిరివెళ్ల,జులై06.అక్షర టైమ్స్:-** సిరివెళ్ల మండలంలో గల కోటపాడు గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల ప్రాంగణంలో దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి పూజారి ప్రసాద్ శర్మ హాజరై చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు,ప్రత్యేక పూజలు,సంప్రదాయ ఆచారాల మధ్య అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించినట్లు ట్రస్ట్ నంద్యాల జిల్లా ధర్మ ప్రచారక్ నాగమల్లేశ్వర్ రెడ్డి తెలిపారు. సరస్వతీ దేవికి విశేష పూజలు నిర్వహించి,అనంతరం చిన్నారులకు దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ మరియు వేద సంకల్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో 40 మంది చిన్నారులకు పలకలు,బలపాలు అందజేసి అక్షరాభ్యాసం నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. తదనంతరం స్కూల్లోని విద్యార్థిని విద్యార్థులందరికీ స్వీట్లతోపాటు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూజారి ప్రసాద్ శర్మ మాట్లాడుతూ ప్రతి చిన్నారి చదువులో రాణించి,ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బాల నాగమణి,ఉపాధ్యాయులు సలోమీ,మల్లికా బాయి,శంకర్,గ్రామ పెద్దలు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడిపై
## అటుకట్టు వేయాలి: ఎ.నూర్ హమ్మద్



**ఆదోని,జూలై06.అక్షర టైమ్స్:-** కర్నూల్ జిల్లా యం.పి. బస్తిపాటి నాగరాజు తో డయల్ యువర్ యం.పి. కార్యక్రమంలో ఫోన్ చేసి మాట్లాడిన మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆదోనిలో మరో మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా జిల్లాలో ప్రైవేటు పాఠశాలల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు ఫీజుల పట్టిక ఏర్పాటు, పేరెంట్స్ మీటింగులు ఖచ్చితంగా నిర్వహించాలని డిమాండ్ చేయడం జరిగింది. సానుకూలంగా స్పందించిన యం.పి. వలసలు మరియు వెనుకబాటుకు కేరాఫ్ అడ్రస్ గా మారిన ఆదోని ప్రాంతంలో ఉన్నత పాఠశాలలు మరియు సంక్షేమ హాస్టళ్ల నిర్మాణానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలిసి ప్రత్యేకంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మరియు ప్రైవేటు పాఠశాలల దోపిడీ గురించి కర్నూల్ జిల్లా కలెక్టర్ తో కలిసి మాట్లాడతానని స్పష్టం చేశారు. మీ కృషి ఫలించి ఆదోని ప్రాంతానికి నూతన విద్యా సంస్థలు రావాలని మరియు ప్రైవేటు పాఠశాలల దోపిడీ ఆగాలి అని యం.పి. బస్తిపాటి నాగరాజు కి అభినందనలు తెలిపారు మరియు కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ఆయన చేస్తున్న కృషిని అభినందించారు

## తుడిమిల్ల మురళీకృష్ణ కి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘన సన్మానం




**బద్వేల్,జులై06.అక్షర టైమ్స్:-** బద్వేల్ పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయము నందు సోమవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో, సోమశిల వెనుక జలాల సాధన సమితి సంయుక్తంగా ఇటీవల రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టుగా నామినేటెడ్ పదవిని పొందిన తుడిమెళ్ళ మురళి ని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సోమశిల వెనుక జలాల సాధన సమితి అధ్యక్షులు పునగాని చంద్రశేఖర్ జాతీయ బీసీ చైతన్య సమితి జాతీయ అధ్యక్షులు బిసి రమణలు మాట్లాడుతూ బద్వేల్ నివాసి అయిన తుడిమెల్ల మురళి కి జనసేన పార్టీ రాష్ట్ర నాయకత్వంలో చోటు కల్పించడం అదేవిధంగా రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవి కేటాయించడం చాలా సంతోష దాయకమైన విషయమన్నారు.బద్వేల్ నియోజకవర్గం అభివృద్ధిలో అభివృద్ధి పోరాటంలో జనసేన మురళి కీలక భూమికి పోషించారని అలాగే సోమశిల వెనక జలాల సాధన సమితిలో ఉద్యమ బాట నడిచారని ప్రజా ప్రయోజన ఉద్యమాలలో భాగస్వామ్యంగా ఉంటూ నిరంతరం ప్రజాసేవలో ఉండటం,ఎవరికి ఏ చిన్న ఆపద వచ్చినా తను స్పందించే తీరు వల్లే ఈ నియోజకవర్గంలోని ప్రజల హృదయాలలో తనకంటూ ఒక స్థానాన్ని కల్పించుకున్నారన్నారు. అలాగే భవిష్యత్తులో కూడా బడుగు బలహీన వర్గాల శ్రేయస్సుకై పాటుపడాలని బద్వేలు నియోజకవర్గం తను కీలక భూమిక పోషించాలని ఆకాంక్షించారు. మా మిత్రుడు మా ఉద్యమ సహచరుడు అంచలంచలుగా ఎదిగి రాబోయే రోజుల్లో మరిన్ని మంచి పదవులు అధిరోహించాలనిమనసారా కోరుకుంటున్నామన్నారు. ఇంజనీర్ గా చదివి ఉద్యోగం చేస్తూ ప్రజాసేవ చేయాలనే ఒక మంచి ఆలోచనతో ఉద్యోగానికి రాజీనామా చేసి దాదాపు 12 సంవత్సరాలు తన నమ్ముకున్న జనసేన పార్టీకి సేవలందిస్తూ ఈరోజు రాష్ట్ర నాయకత్వంలో చోటు కల్పించబడడం ఆయన కష్టానికి ఫలితంగా భావించాలని కష్టపడ్డ ఎవరు కూడా ఫలితం అందుకోకుండా పోలేదని వారన్నారు. రాబోవు రోజుల్లో పార్టీ నిర్మాణ కార్యక్రమంలో తనకంటూ ఒక గొప్ప గుర్తింపును పొందాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఇరుపోతు శ్రీనివాస్ వర్మ,పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య,సోమేశల వెనుక జలాల సాధన సమితి నాయకులు బుడిగి రామ సుబ్బారెడ్డి, భారత కమ్యూనిస్టు పార్టీ సి బద్వేలు రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేలు,జనసేన పార్టీ నాయకులు రమణ, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు ప్రసాదు, పెన్షనర్స్ అసోసియేషన్ కోశాధికారి అధ్యక్షులు జిపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ కు ఘన నివాళి



**బద్వేల్,జులై06.అక్షర టైమ్స్:-** బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి సందర్భంగా బద్వేల్ పట్టణంలోని ఆయన విగ్రహానికి మాదిగ ఉద్యోగుల సమైక్య ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.స్వాతంత్ర సమరయోధులు, భారతదేశ దళిత ఉప ప్రధాని, భారతదేశంలో దళితుల పక్షాన సామాజిక న్యాయం కోసం పోరాడిన యోధుడు, పార్లమెంటులో అత్యధిక కాలం పనిచేసిన రాజకీయవేత్త అని పలువురు ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ నాయకులు సిరంగి దేవానందం, సీనియర్ నాయకులు జాల గురయ్య ,ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హనుమంతు వెంకటసుబ్బయ్య, దళిత సీనియర్ నాయకులు ఓ.ఎస్.వి ప్రసాద్ , బద్వేల్ నియోజకవర్గ మాదిగ ఉద్యోగుల సమాఖ్య మాజీ అధ్యక్షులు దాసరపల్లి సురేష్, బద్వేల్ నియోజకవర్గ మాదిగ ఉద్యోగుల సమాఖ్య ప్రస్తుత అధ్యక్షులు యర్రబల్లె ఓబయ్య ,ఉపాధ్యక్షులు సోమిరెడ్డిపల్లి జయచంద్ర , గొడుగునూ రు రాజేంద్రప్రసాద్ , సగినాల డేవిడ్, నియోజకవర్గ నాయకులు ఎమ్మార్పీఎస్ నాగిపోగు ప్రసాద్, పంతులయ్య, శ్రీనివాసులు, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 200 ఆహారోత్పత్తులపై టారిఫ్ ఉపసంహరణ

ప్రజాగ్రహంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం

భారతీయ ఎగుమతిదారులకు ప్రయోజనకరం



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లపై యూటర్న్ తీసుకున్నారు. కిరాణా సరుకుల ధరలు పెరిగిపోతుండటంతో ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతున్న నేపథ్యంలో ట్రంప్ వెనుకంజ వేశారు. కాఫీ, టీ, మసాలా దినుసులు, బీఫ్, అరటిపండ్లు, నారింజ రసం సహా 200కుపైగా ఆహారోత్పత్తులపై టారిఫ్‌లను ఉపసంహరించారు. ఇటీవల వర్జీనియా, న్యూజెర్సీ, న్యూయార్క్ సిటీల్లో జరిగిన స్థానిక ఎన్నికల్లో డెమొక్రాట్లు గెలవడంతో ట్రంప్ రూటు మార్చారు. ఆయన ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకర్లతో మాట్లాడుతూ, దిగువ, మధ్య స్థాయి ఆదాయాలు గల వారికి వచ్చే సంవత్సరం నుంచి 2,000 డాలర్లు చెల్లిస్తామన్నారు.

# మోదీ మౌనం వెనుక మర్మమేమిటి?




'ఇకమీదట భారత్‌లో ఉగ్రదాడి జరిగితే దానిని యుద్ధంగానే పరిగణిస్తాం' అని ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ప్రధాని మోదీ ప్రకటించారు.ఉగ్రదాడి జరిగిన మరుక్షణమే పాక్‌పై భారత్ యుద్ధభేరి మోగిస్తుందని కూడా హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్ భవిష్యత్తులోనూ కొనసాగుతుందని కూడా దేశ ప్రజలకు అభయమిచ్చారు. కానీ, ఆరు నెలలు కూడా గడవకముందే దేశంలో మరో ఉగ్రదాడి జరిగింది. అది కూడా దేశ రాజధాని ఢిల్లీలో, కేంద్ర ప్రభుత్వ పరిపాలనా సౌధాలకు కూతవేటు దూరంలో, పంద్రాగస్టు సందర్భంగా ప్రధాని మోదీ సందేశమిచ్చే ఎర్రకోటకు అతి సమీపంలో%ూ% ఈ దాడి జరగడం బీజేపీ సర్కార్ వైఫల్యానికి నిదర్శనం. కాంగ్రెస్ పాలనలో మన దేశంలో ఉగ్రదాడులు ఎక్కువగా జరిగేవి. ముంబై 26/11 ఉగ్రదాడిని చూసి ప్రపంచమే కలవరపడింది. మన హైదరాబాద్‌లోనూ గోకుల్‌చాట్, దిల్‌సుఖ్‌నగర్‌లలో బాంబు పేలుళ్లు సంభవించాయి. హస్తం పాలన లో వేళ్లూనుకుపోయిన అవినీతి, శాంతిభద్రతల సమస్యను 2014 ఎన్నికల ప్రచారాంశంగా వాడుకున్న మోదీ.. తాము అధికారంలోకి వస్తే ఉగ్రవాదానికి అడ్డుకట్ట వేస్తామని హామీ ఇచ్చారు. కానీ, మోదీ సర్కార్ కొలువయ్యాక దేశంలో ఉగ్రదాడులు ఇంకా ఎక్కువయ్యాయి. 2014 నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా సుమారు 68 ఉగ్రదాడులు జరగడం పరిస్థితికి అద్దం పడుతున్నది. ఈ పదకొండేండ్లలో గురుదాస్‌పూర్, పఠాన్‌కోట్, పుల్వామా, పాంపోర్, ఉరి, రియాసీ, పహల్గాం, తాజాగా ఎర్రకోట వద్ద భారీ ఉగ్రదాడులు జరిగాయి. ఈ దాడుల్లో సుమారు 360 మంది సైనికు లు, 230 మంది పౌరులు మృతిచెందడం బాధాకరం.

కాంగ్రెస్ హయాంలో సామాన్య ప్రజలు ఎక్కువగా చనిపోగా, బీజేపీ పాలనలో మాత్రం జవాన్లు అమరులవుతుండటం అనుమానాలకు తావిస్తున్నది. సైనికుల తరలింపు కోసం హెలికాప్టర్లను పంపించాలని తాను కోరినా కేంద్రం పట్టించుకోలేదని పుల్వామా దాడి సమయంలో జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా ఉన్న సత్యపాల్ మాలిక్ ఆరోపించడం ఈ అనుమానాలను బలపరుస్తున్నది. జవాన్లపై దాడులు జరుగుతాయని తెలిసినా, ఉద్దేశపూర్వకంగానే వారిని బలిచేశారా? అన్న అనుమానాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. యూపీఏ పాలనలో దేశంలో ఉగ్రదాడులు జరిగినప్పుడు నాటి పాలకపక్షం కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యేది. శాంతిభద్రతల పరిరక్షణలో కాంగ్రెస్ విఫలమైందని సర్వత్రా విమర్శలు వచ్చేవి. కానీ, మోదీ పాలనలో పదుల సంఖ్యలో ఉగ్రదాడులు జరుగుతున్నా ఈ విధమైన విమర్శలు ఎక్కువగా కానరావడం లేదు. మోదీ ప్రభుత్వ వైఫల్యం కారణంగానే దాడులు జరుగుతున్నాయనే ప్రచారం జరగకుండాబీ దేశభక్తి, జాతీయవాదం అంటూ బీజేపీ మేనేజ్ చేస్తూ రాజకీయ లబ్ధి పొందుతుండటం శోచనీయం. దేశంలో ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఏదో ఒక ప్రాంతంలో ఉగ్రదాడి జరుగుతున్నదనే తీవ్ర ఆరోపణ కూడా ఉన్నది. 2016 జనవరిలో పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌పై ఉగ్రవాదులు దాడికి తెగబడగా, 8 మంది జవాన్లు అమరులయ్యారు. ఆ తర్వాత ఏప్రిల్- మే నెలల్లో అసోం, పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిల అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఉగ్రదాడికి ప్రతీకారంగా 2016 సెప్టెంబర్ 18న పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత ఆర్మీ సర్జికల్ స్ట్రైక్ చేసింది. ఆ తర్వాత 2017 ఫిబ్రవరి- మార్చి నెలల్లో యూపీ, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్ రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగాయి. 2017 జూలైలో అమర్‌నాథ్ యాత్రికులపై ఉగ్రదాడి జరగగా, అదే ఏడాది నవంబర్- డిసెంబర్ నెలల్లో గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగాయి. ఇక 2019 ఫిబ్రవరిలో జరిగిన పుల్వామా ఘాతుకం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఫిబ్రవరి 26న భారత సేనలు బాలాకోట్ ఎయిర్‌స్ట్రైక్ చేయగా, ఆ తర్వాత ఏప్రిల్- మే నెలల్లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం విదితమే. ఉగ్రదాడి జరగడం, దాని తర్వాత మూణ్నాలుగు నెలలకే ఎన్నికలు రావ డం, అత్యధిక చోట్ల బీజేపీ గెలుపొందడం మధ్య ఉన్న సంబంధం స్పష్టంగా తెలియనప్పటికీ, ఎన్నికల సమయంలో ఉగ్రదాడులు జరిగి, ప్రజా సమస్యలు పక్కదారి పట్టడంతో బీజేపీ లబ్ధి పొందుతున్నదనేది మాత్రం సుస్పష్టం.

పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది పౌరులు మరణించారు. ఈ దారుణం పట్ల దేశవ్యాప్తంగా వ్యతిరేకత రావడంతో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసినట్టు ప్రకటించింది. ఇరువైపులా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇది పాక్-భారత్ యుద్ధంగా మారింది. ఆర్మీకి పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, ఇక పాక్‌ను తుడిచిపెట్టేస్తామని, పీవోకేను స్వాధీనం చేసుకుంటామని, దాయాదిని నామరూపాల్లేకుండా చేస్తామని బీజేపీ పాలకులు ప్రగల్భాలు పలికారు. కానీ, రెండు రోజులయ్యాక అటునుంచి వచ్చే డ్రోన్ల ను కూల్చుడు తప్ప, ఇటు నుంచి ఒక్క తూటా పేల్చకుండా ఆర్మీ చేతులను కట్టేశారు. ఆర్మీకే తెలియకుండా, అటువైపు నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాకుండానే, అమెరికా అధ్యక్షుడి ఒత్తిడికి లొంగిపోయి కాల్పుల విరమణకు బీజేపీ సర్కార్ అంగీకరించింది. పైగా దాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అయితే, పాక్‌ను ఉగ్రవాద దేశంగా ప్రపంచానికి నిరూపించి, దోషిగా నిలబెట్టడంలో మోదీ సర్కార్ విఫలమైంది. అంతేకాదు, ఉగ్రవాదంపై పోరును బీజేపీ పాలకులు అత్యుత్సాహంతో ఒక వర్గానికి వ్యతిరేక పోరుగా మార్చడంతో అంతర్జాతీయంగా భారత్ ఒంటరైపోయింది. ఈ కారణంగానే చైనా, తుర్కియే, అజర్‌బైజాన్ లాంటి దేశాలు పాక్‌కు ప్రత్యక్షంగా మద్దతు తెలపగా, అరబ్ దేశాలు పరోక్షంగా మద్దతిచ్చి, అమెరికా సహకారంతో పాక్‌కు ఐఎంఎఫ్ రుణం వచ్చేలా చేశా యి. టారిఫ్‌ల పేరిట బెదిరించి ఇరుదేశాలను లొంగదీసుకున్నానని పదే పదే చెప్పిన ట్రంప్.. ప్రధాని మోదీని మరింత ఇరుకున పెట్టేశారు.

ఈ క్రమంలో తాజాగా ఢిల్లీలో ఉగ్రదాడి జరిగినా మోదీ సర్కార్ కిక్కురుమనడం లేదు. కాంగ్రెస్ హయాంలో ఉగ్రదాడులు జరిగినప్పుడు నాడు సీఎం గా ఉన్న మోదీ అప్పటి మన్మోహన్ సర్కార్‌పై తీవ్రంగా విరుచుకుపడ్డారు. సరిహద్దుల్లో ఉన్న అనేక రాష్ట్రాలు కాంగ్రెస్ పాలనలోనే ఉన్నాయనిబీ త్రివిధ దళాలు కేంద్రం చేతుల్లోనే ఉన్నాయని, అయినా ఉగ్రవాదులు దేశంలోకి ఎలా చొరబడుతున్నారని, దాడులు ఎలా చేస్తున్నారని మోదీ నాడు ప్రశ్నించారు. మరి నేడు సరిహద్దుల్లోని రాష్ట్రాల్లో ఎవరి పాలన నడుస్తున్నది? త్రివిధ దళాలు ఇప్పుడు మోదీ చేతుల్లో లేవా? కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌లో శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నది మోదీ సర్కార్ కాదా? అలాంటప్పుడు ఉగ్రవాదులు దేశంలోకి ఎలా చొరబడుతున్నారు? దేశ రాజధానిలో ఎలా దాడులు చేయగలుగుతున్నారు? ఇది మోదీ సర్కార్ వైఫల్యం కాదా? ఎర్రకోట వద్ద ఉగ్రదాడి జరిగాక రెండు రోజుల వరకు ఉగ్రదాడా, కాదా? అన్నది స్పష్టం చేసేందుకు కూడా మోదీ సర్కార్ సాహసించలేదు. 48 గంటలు గడిచాక జైషే మహమ్మద్ పని అంటూ చావుకబురు చల్లగా చెప్పింది. అయితే, మరోసారి దేశంలో ఉగ్రదాడి జరిగితే యుద్ధానికి ఆహ్వానంగానే పరిగణిస్తామని చెప్పిన మోదీ ఇప్పుడు కనీసం దానిపై నోరు విప్పడం లేదు. అంటే ఈ ఉగ్రదాడిలో పాక్ ప్రమేయం లేదని మోదీ చెప్తున్నారా? లేదా పాక్ ప్రమేయం ఉందని తెలిసినా, దాని వెనుక ఉన్న అమెరికా, చైనాలకు జడిసి నోరుమెదపడం లేదా? అసలు పాక్ ప్రమేయం లేకుండా భారత్‌లో ఉగ్రదాడి జరిగే ఆస్కారం ఉందా? ఇంకా కొనసాగుతుందని చెప్పిన ఆపరేషన్ సిందూర్ ఏమైంది? పాక్ కేంద్రంగా పనిచేసే జైషే మహమ్మద్ హస్తం ఉందని భద్రతా దళాలు ప్రకటించిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వెనుక ఉన్న మర్మమేమిటన్నది తెలియాల్సి ఉన్నది.

# తొలి తెలంగాణ ఉద్యమ నేత



ఐదు దశాబ్దాల కిందట అనంతుల మదన్‌మోహన్ ఆధ్వర్యంలో జరిగిన తొలి దశ ఉద్యమం గురించి నేటి తరానికి తెలియకపోవచ్చు. తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడిగా 1968-69లో ఆయన తొలి తెలంగాణ ఉద్యమాన్ని పరుగులు పెట్టించారనే విషయాన్ని నేటి యువత తెలుసుకోవాలి. మదన్ మోహన్ జయంతి సందర్భంగా ఆయన సేవలను తెలంగాణ గడ్డ స్మరించుకోవాలి. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపాకకు చెందిన అనంతుల మదన్ మోహన్ 1932, నవంబర్ 16న జన్మించారు. మదన్ మోహన్ తండ్రి చక్రపాణి నిజాం హయాంలో కరీంనగర్ జిల్లాలో నాయబ్ తహశీల్దార్‌గా (డిప్యూటీ ఎమ్మార్వో) పనిచేశారు. కొండపాకలో ప్రాథమిక విద్యాభ్యాసాన్ని పూర్తిచేసిన మదన్ మోహన్, వరంగల్‌లో మెట్రిక్యులేషన్, హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో డిగ్రీ, ఓయూలో ఎల్‌ఎల్‌బీ పూర్తిచేశారు. 1955-1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మొదలయ్యేసరికి హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ సమకాలీన రాజకీయాలను అధ్యయనం చేస్తుండేవారు. అయితే, 1956 నవంబర్ 1న నాటి నెహ్రూ ప్రభుత్వం హైదరాబాద్ స్టేట్‌ను ఆంధ్ర రాష్ట్రంలో కలిపింది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచీ తెలంగాణకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారు నాటి సీమాంధ్ర పాలకులు. తెలంగాణ ప్రాంతం దోపిడీకి గురవడంతో తెలంగాణలో ఆందోళనలు మిన్నంటాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రజల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మేధావులు, యువకులు, సామాజిక కార్యకర్తల నేతృత్వంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ప్రజాసమితి (టీపీఎస్) ఏర్పడింది. యువకుడు, విద్యావంతుడు, మేధావి, న్యాయవాది అయిన అనంతుల మదన్ మోహన్ టీపీఎస్‌కు వ్యవస్థాపక అధ్యక్షుడయ్యారు. ఏప్రిల్ 5న సికింద్రాబాద్‌లో రాష్ట్ర సమైక్యతను కోరుకుంటూనే తెలంగాణకు రక్షణ ఇవ్వాలని బహిరంగసభ నడిపిన కమ్యూనిస్టులకు, తెలంగాణవాదులకు (టీపీఎస్) మధ్య గొడవ జరిగింది. మదన్‌మోహన్‌తోపాటు నాటి విద్యార్థి జేఏసీ ప్రధాన కార్యదర్శి మల్లిఖార్జున్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో తెలంగాణవాదుల అరెస్టుకు నిరసనగా ఏప్రిల్ 11న హైదరాబాద్‌లో సామూహిక సత్యాగ్రహం జరిగింది. మరోవైపు శాసనసభ్యుడిగా చెన్నారెడ్డి ఎన్నిక చెల్లదని, ఆయన ఆర్నెళ్ల పాటు పోటీ చేయకూడదని 1968 ఏప్రిల్ 26న హైకోర్టు తీర్పు ఇచ్చింది. అప్పటికే మదన్‌మోహన్ అధ్యక్షుడిగా తెలంగాణ ఉద్యమం సమర్థంగా నడుస్తున్నది. కానీ, ఆ ఉద్యమానికి చెన్నారెడ్డి నాయకత్వం వహించాలన్న ఒక వర్గం కుట్రల ఫలితంగా మదన్ మోహన్ టీపీఎస్ పగ్గాలను వదులుకున్నారు. 1969లో టీపీఎస్ నేతృత్వంలో ఉద్యమం ఉధృతం కాగా, పోలీసుల కాల్పుల్లో 369 మంది విద్యార్థులు చనిపోయారు. దీంతో ఉద్యమానికి తాత్కాలిక విరామం ప్రకటించాల్సి వచ్చింది. ఆ తర్వాత 1970లో జరిగిన ఉప ఎన్నికల్లో సిద్దిపేట నుంచి మదన్‌మోహన్ 20 వేల మెజారిటీతో, ఖైరతాబాద్ నుంచి నాగం కృష్ణారావు 15 వేల మెజారిటీతో గెలిచారు. ప్రత్యేక రాష్ట్రం సాధించగలమనే నమ్మకాన్ని టీపీఎస్‌కు ఈ విజయం అందించింది. ఆ తర్వాత మదన్‌మోహన్ 1971 నుంచి 1985 వరకు వరుస గా సిద్దిపేట ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చారు. పీవీ నరసింహారావు, చెన్నారెడ్డి, భవనం వెంకట్రామ్, టి.అం జయ్య, కోట్ల విజయభాస్కర్‌రెడ్డిల హయాంలో మద న్ మోహన్ వివిధ మంత్రిత్వ శాఖలను నిర్వహించా రు.

మదన్ మోహన్ ఉన్నత సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడే హైదరాబాద్‌లో జేఎన్‌టీయూ స్థాపితమైంది. ఆయన ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న కాలంలోనే ప్రైమరీ హెల్త్ సెంటర్లు (పీహెచ్‌సీలు) ఏర్పడ్డాయి. అంతేకాదు, దాదాపు 10 నుంచి 12 వేల మందికి ఆయన వివిధ శాఖల్లో కొలువులు ఇప్పించారు. సిద్దిపేటలో 220 కేవీ సబ్‌స్టేషన్, టీవీ రిలే స్టేష న్, నెహ్రూ యువ కేంద్రాలు, మిల్క్ చిల్లీ సెంటర్, ఇందిరా మహిళా డిగ్రీ కాలేజీలను ఆయన ఏర్పాటు చేశారని సిద్దిపేట ప్రాంతవాసులు ఇప్పటికీ గుర్తుచేసుకుంటారు. కొండాపూర్ పీహెచ్‌సీకి తన తండ్రి స్మారకంగా రెండెకరాల భూమిని ఆయన విరాళంగా ఇచ్చా రు. 1990లో ఏపీ పారిశ్రామికాభివృద్ధి సంస్థ చైర్మన్ గా, 1989లో పీసీసీ జనరల్ సెక్రెటరీగా, ఏఐసీసీ మెంబర్‌గా (శాశ్వత ఆహ్వానితుడిగా) సేవలందించా రు. 1994లో చివరిసారిగా ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేశారు. 1998లో కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్ర స్టేట్ ఇంచార్జిగా పనిచేశారు. రాజకీయాల్లో ఉన్నత విలువలు పాటించిన మదన్‌మోహన్ 2004, నవంబర్ 1న హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఒక మహోజ్వల ఘట్టం. ఆ పోరాటంలో 369 మంది యువకులు, తొలి తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో క్రియాశీల నాయకుడైన మదన్ మోహన్ నిత్య స్మరణీయులు. నాడు ఉద్యమాన్ని నడిపించిన నేతలు, యువకులు, విద్యార్థులే ఆ తర్వాతి కాలంలో దేశ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగారు. ఆ పోరాటం భవిష్యత్తు కొనసాగింపునకు, స్వరాష్ట్ర కల సాకారమయ్యేందుకు భూమికగా నిలిచింది. అది విస్మృత చరిత్ర కాదు. ఆ చరిత్రను నేడు మనందరం మననం చేసుకోవాలి. (మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చేతుల మీదుగా తొలి తెలంగాణ ఉద్యమ నేత మదన్ మోహన్ విగ్రహావిష్కరణ నేడు జరుగుతున్న సందర్భంగా..)

## చైనీస్ ఫాస్ట్ ఫుడ్‌ను ఎక్కువగా తింటున్నారా..? అయితే ఈ నిజం తెలిస్తే ఇకపై అలా చేయరు..!



ప్రస్తుతం నడుస్తున్నది అంతా ఫాస్ట్ యుగంగా మారింది. ప్రజలు అన్నింట్లోనూ వేగాన్ని కోరుకుంటున్నారు. తమ పనులు వేగంగా జరగాలని ఆశిస్తున్నారు. అందులో భాగంగానే ఆహారం విషయంలోనూ వారు ఎక్కువగా ఫాస్ట్ ఫుడ్ ను తీసుకుంటున్నారు. సమయం ఉండడం లేదని లేదా వంట చేయలేదని చాలా మంది బయటకు వెళ్లి ఫాస్ట్ ఫుడ్స్‌ను లాగించేస్తున్నారు. ఫ్రైడ్ రైస్, మంచూరియా, నూడుల్స్ వంటి చైనీస్ ఫాస్ట్ ఫుడ్‌ను తినడం ఎక్కువైపోయింది. అయితే ఈ ఫుడ్స్‌ను ఎప్పుడో ఒకసారి తింటే ఫర్వాలేదు. శరీరానికి కలిగే హాని ఏమీ ఉండదు. కానీ చాలా మంది ఫాస్ట్ ఫుడ్స్‌ను తరచూ తింటున్నారు. ఇది ఆరోగ్యానికి చాలా హాని చేస్తుందని, అనేక వ్యాధులను, అనారోగ్య సమస్యలను తెచ్చి పెడుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్‌ను తరచూ తినే వారు జాగ్రత్తగా ఉండాలని వారు సూచిస్తున్నారు.

### తీవ్రంగా హాని చేసే అజినొమోటో..

ప్రస్తుతం మనకు బయట ఎక్కడ చూసినా ఫాస్ట్ ఫుడ్ చాలా ఎక్కువగా అందుబాటులో ఉంటోంది. రహదారుల పక్కన చైనీస్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఎక్కువగా వెలుస్తున్నాయి. వాటిల్లో అనేక రకాల ఫాస్ట్ ఫుడ్స్ ను విక్రయిస్తున్నారు. ఆ ఫుడ్స్ అన్నీ ఎంతో రుచిగా ఉంటాయి. వాటిని వండేటప్పుడు వచ్చే వాసనకే చాలా మంది ఫిదా అవుతుంటారు. దీంతో వారు ఆ ఫుడ్స్‌ను తినేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. ఫాస్ట్ ఫుడ్స్ వాసన చూస్తేనే కొందరికి నోట్లో నీళ్లూరతాయి. అయితే ఫాస్ట్ ఫుడ్స్ ను తరచూ తినడం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయి. ఫాస్ట్ ఫుడ్ లో అజినొమోటో కలుపుతారు. అందువల్లే ఆ ఫుడ్స్‌కు అంతటి టేస్ట్ వస్తుంది. వాస్తవానికి దీన్ని ఆహారాల్లో వాడకూడదని ఎప్పుడో నిషేధం విధించారు. కానీ ఈ రూల్‌ను చాలా మంది పాటించడం లేదు. విచ్చల విడిగా అజినొమోటోను వాడుతున్నారు. ఇది మన ఆరోగ్యానికి తీవ్రంగా హాని చేస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### అధిక మొత్తంలో సోడియం..

అజినొమోటోనే మోనో సోడియం గ్లూటమేట్ అని లేదా ఎంఎస్‌జీ లేదా టేస్టింగ్ సాల్ట్ అని రకరకాల పేర్లతో పిలుస్తారు. దీన్ని వేయడం వల్ల వంటకాలకు చక్కని రుచి, వాసన వస్తాయి. అయితే ఇది ప్రమాదకరమైన రసాయనం అని, దీన్ని తీసుకోవడం వల్ల అనేక వ్యాధులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అజినొమోటోలో 12.3 శాతం వరకు సోడియం ఉంటుంది. 21.1 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం, 0.4 మిల్లీగ్రాముల మేర ఐరన్ ఉంటాయి. అయితే సోడియం అధికంగా ఉంటుంది కనుక అజినొమోటో ఆరోగ్యకరమైనది కాదు. ఇది మన శరీరంలో చేరినప్పుడు అనారోగ్య సమస్యలను కలగజేస్తుంది. మనకు వ్యాధులు వచ్చేలా చేస్తుంది.

### అనేక అనారోగ్య సమస్యలు..

అజినొమోటోను అధికంగా తీసుకుంటే శరీరంలో సోడియం ఎక్కువగా చేరుతుంది. ఇది కిడ్నీలపై భారం పెంచుతుంది. దీంతో కిడ్నీ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయి. అలాగే సోడియం వల్ల రక్త నాళాలపై ఒత్తిడి పడుతుంది. దీంతో బీపీ పెరుగుతుంది. హైబీపీకి ఇది దారి తీస్తుంది. గుండె పనితీరు మందగిస్తుంది. దీని వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు ఉంటాయి. అజినొమోటో వల్ల శరీరంలో సోడియం అధికమై చెమట అధికంగా ఉత్పత్తి అవుతుంది. దీంతో చెమట పట్టినప్పుడు శరీరం దుర్వాసన వస్తుంది. అలాగే అలసట, డీహైడ్రేషన్, కీళ్లు, కండరాల నొప్పులు, జీర్ణాశయంలో మంట, గ్యాస్, అసిడిటీ, బీపీ, తలనొప్పి, నిద్రలేమి వంటి సమస్యలు వస్తాయి. ఇలా అజినొమోటో మనకు ఎంతో కీడు చేస్తుంది. కనుక అది ఉండే ఫాస్ట్ ఫుడ్స్‌ను అతిగా తినడం తగ్గించాలి. లేదంటే అనవసరంగా రోగాల బారిన పడాల్సి ఉంటుంది.